ప్రజాశక్తి

శుక్రవారం 17 అక్టోబర్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

గుర్తింపుకే పరిమితమైన

వెనుకబాటు.!

- జిల్లా అభివృద్ధికి ప్రత్యేక గ్రాంట్ల కేటాయింపు శూన్యం
- అన్ని జిల్లాలతోనే విజన్ డాక్యుమెంట్లు, అభివృద్ధి ప్రణాళికలు
- వెనుకబడిన జిల్లాగా గుర్తించినా.. కేంద్రం నుంచి చేయూత ఏదీ?

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఫ్లోరిన్ సమస్యతో కిడ్నీల వ్యాధులు.. తాగునీటి కష్టాలు.. ఇంటింటికీ కుళాయి ఇవ్వలేని దైన్యం.. ఎండమావులుగా మారిన పారిశ్రామిక కేంద్రాలు.. నిధుల్లేక ముందుకు సాగని వెలిగొండ ప్రాజెక్టు.. ప్రతిపాదనల్లోనే ఉన్న భారీ తాగునీటి పథకాలు.. కరువు నుంచి శాశ్వత పరిష్కారం దొరక్క రైతుల అవస్థలు.. ఏటా సాగునీరు వస్తుందో, లేదో చెప్పలేని పరిస్థితి.. నిధుల్లేక మూతపడ్డ జిల్లా డెయిరీ.. మౌలిక సదుపాయాల కల్పనకూ నిధుల్లేక అవస్థలు.. పేదల ఇళ్లు పునాదుల్లోనే.. స్థూలంగా జిల్లా పరిస్థితి ఇదీ. ఈ అంశాలన్నీ జిల్లా వెనుకబాటుతనాన్ని విదితం చేస్తున్నాయి. ఎప్పటి నుంచో జిల్లాను వెనుకబడిన జాబితాల్లో చేర్చాలని వామపక్షాలు ఆందోళనలు చేపట్టాయి. రాష్ట్రం విడిపోయాక జరిగిన అన్యాయంపై కేంద్రం ఇటీవల స్పందించింది. జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించింది. అందరూ హర్షించారు. ప్రత్యేక గ్రాంట్లు వస్తాయని భావించారు. అప్పట్లో వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయించారు. ఇప్పుడు జిల్లాను వెనుకబడినట్లు గుర్తించారే తప్ప నిధుల మాట మరిచారు. సాధారణంగా అన్ని జిల్లాలకు వచ్చే నిధులు తప్ప ప్రత్యేకంగా ఏమీ లేవు. ఏ పనులు చేయాలన్నా నిధుల్లేవనే మాటలే ఎమ్మెల్యేల నుంచి వినిపిస్తున్నాయి. సిఎం చంద్రబాబును కలిసినప్పుడల్లా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు నిధులు కోరుతున్నారు. అయితే పైసా కూడా రావడం లేదు. కేవలం నిధుల్లేకపోవడంతో పాటు కాంట్రాక్టర్ల విషయంలో స్పష్టత లేకనే టిడ్కో ఇళ్లు ఆగిపోయాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇళ్లు ఇప్పటికీ అలాగే ఉంచారు. శిథిలావస్థకు చేరుతున్నాయి. వాటిపై తర్జనభర్జన ▶ 2లో

ధనిక రైతుకు

డీకే పట్టా ఎలా ఇచ్చారో.?



కాలువను పూడ్చి వేసి నేరుగా సముద్రంలోకి వేసిన రహదారి

- మత్స్యకారుల మేలు కోసం రద్దు చేయలేరా.?
- 3.42 ఎకరాల డీకే పట్టా చుట్టూ తిరుగుతున్న స్ట్రయిట్‌కట్ కాలువ వివాదం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో చీరాల-బాపట్ల సరిహద్దుల్లో ఉన్న ఈపురుపాలెం స్ట్రయిట్ కట్‌కు కొనసాగింపుగా సహజసిద్ధంగా ఏర్పడిన కాలువను దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో ఉన్న 9 గ్రామాల మత్స్యకారులు తమ బోట్ల రాకపోకలకు వినియోగిస్తున్నారు. ఈ కాలువ భూమి తనదంటూ బుర్ల వెంకట్రావు అనే ధనిక రైతు అధికారం అండగా సదరు కాలువను పూడ్చివేసి నేరుగా సముద్రంలోకి రహదారిని నిర్మించుకున్నారు. ఈ ఆక్రమణ విషయమై మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. పూర్వ కలెక్టర్ వెంకటమురళి హయాంలో తమకు న్యాయం జరగలేదంటూ.. కాలువ ఆక్రమణ విషయమై మత్స్యకారులు ఈ నెల ఆరంభంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారుల బృందంతో కమిటీ వేశారు. అక్కడ ఉన్న భూములను రీసర్వే చేశారు. చేసిన సర్వే ప్రకారం ప్రస్తుతం వివాదాస్పదం అయిన బాపట్ల మండలం, అడవి రెవెన్యూ పంచాయతీలోని సర్వేనెంబర్ 499-2 లోని 3.42 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందింది. సదరు భూమిని రెవెన్యూ అధికారులు వెంకట్రావు పేరుతో డికెటి పట్టా ఇచ్చారు. ఎక్కడయినా పేదలు, బలహీనవర్గాలకు చెందిన వారు ఎవరైనా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటుంటే డికెటి పట్టా ఇస్తారు. కానీ ప్రభుత్వ రికార్డుల ప్రకారం సాగుకు పనికి రానిదిగా పాండురంగాపురం గ్రామకంఠానికి చెందినదిగా ఉన్న భూమిని వెంకట్రావుకు అడ్డగోలుగా రెవెన్యూ వారు ధారాదత్తం చేశారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పుడు చేసిన సర్వే ప్రకారం సముద్ర ముఖద్వారంలో స్ట్రెయిట్ కట్ కాలువ సముద్రంలో కలిసే భూమి. అక్కడ గతంలో వంపు తిరిగి పూడ్చివేతకు గురయిన భూమి పాండురంగాపురం గ్రామ ఖంఠంకు చెందిన భూమి. అక్కడ గతంలో కాలువ ఉంది. దాన్ని వెంకట్రావు పూడ్చి వేశారు. సముద్రం ఆటుపోటు సమయంలో అలలు ఆ భూమిని మించి వస్తాయి. అలాంటి గ్రామకంఠం భూమిని రెవెన్యూ వారు బుర్ల వెంకట్రావుకి డీకే పట్టా ఇచ్చారు. ఈ భూమికి దిగువన ఉన్న భూముల్లో గుంటూరుకు చెందిన శ్రీ భ్రమరా రిసార్ట్సు వారు భారీ వెంచర్ వేశారు. ఈ వెంచర్‌లో బుర్ల వెంకట్రావు భాగస్వామి అయ్యారు. తనకు, తన భార్య పేరుతో ఉన్న 20.36 ఎకరాలను డెవలప్‌మెంట్ కోసం భ్రమరా వారితో అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. సదరు రిసార్ట్సుకు బీచ్ వ్యూ కావాలంటే ఈ డికె పట్టా భూమి ▶ 2లో



విద్యార్థులతో కలెక్టర్ రాజాబాబు

పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశాభివృద్ధి

కలెక్టర్ రాజాబాబు

▶ 5లో



సైకత శిల్పాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

విద్యార్థులకు

అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నాం..

- విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- గురుకులాల్లో 100 శాతం ఫలితాలే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలి
- మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి



గురుకుల పాఠశాలలో పరిశీలిస్తున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. పి4లో భాగంగా పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. గురువారం నాడు త్రిపురాంతకం మండలం, దూపాడులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, వంటగది పరిసర ప్రాంతాలను మంత్రి పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ▶ 2లో

పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. గురువారం బాపట్ల సూర్యలంక బీచ్‌లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కోసం బీచ్‌లో ఏర్పాటు చేసిన శాండ్ ఆర్ట్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ఆర్ట్ ఈ నెల 19వ తేదీ వరకు ప్రదర్శన కోసం ఉంచడం జరుగుతుందని, పర్యాటకులు అందరూ కూడా చూడాలని కోరారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివద్ధి చేయడానికి ప్రభుత్వం రూ 97.52 కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. సూర్యలంక బీచ్‌లో టాయిలెట్లు, స్నానపు షవర్లు, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, డ్రస్ చేంజ్ రూమ్స్, పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు షాప్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. షాప్ ఫెస్టివల్ కార్యక్రమంలో ప్రభుత్వం ఇచ్చిన జీఎస్టీ సేవింగ్స్‌తో పాటు అదనపు డిస్కౌంట్‌లను షాపు యజమాని ప్రజలకు ఇస్తారని చెప్పారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వాడరేవు బీచ్‌లో ఇటీవల జరిగిన ఘటన చాలా బాధాకరమని, ఇలాంటి ఘటనలు జరగకుండా బీచ్‌ల వద్ద ▶ 2లో



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరావు అన్నారు. గురువారం మండలం లోని తువ్వపాడు గ్రామ పంచాయతీని సందర్శించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టంపై ఎస్సీ కాలనీలోని ప్రజలకు అవగాహన కలిగించారు. తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలని క్లాప్ మిత్రలకు సూచనలు చేశారు. ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌ను మరమ్మత్తులు చేయించి వాడుకలోకి తీసుకునిరావాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.ఈశ్వరమ్మ, డిప్యూటీ ఎంపీడీవో జి శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

15 మంది స్విమ్మర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. సముద్ర స్నానానికి వెళ్లే పర్యాటకులు మద్యం సేవించి వెళ్లరాదని పేర్కొన్నారు. సముద్రంలో ప్రమాదాలు జరిగిన వెంటనే రక్షించడానికి నాలుగు బోట్లను ఏర్పాటు చేశామని చెప్పారు. బీచ్‌కు వచ్చే పర్యాటకులు సముద్రంలో లోతైన ప్రాంతాల వెళ్లకుండా సమీప ప్రాంతాల్లో స్నానాలు ఆచరించి సురక్షితంగా తిరిగి వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్, జిఎస్టి స్టేట్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ మురళీకష్ణ, అసిస్టెంట్ కమిషనర్ గ్లోరియా కుమారి, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, తహసిల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపుకే పరిమితమైన 'వెనుకబాటు'

(మొదటిపేజీ తరువాయి)

నడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్లు పూర్తి కాలేదు. అవి పూర్తి చేసుకుంటామనే ధీమా కూడా లబ్ధిదారుల్లో కనిపించడం లేదు. ఇలాంటి పేదలకు ప్రభుత్వాల నుంచి ఏ భరోసా లేదు. వెనుకబడిన జిల్లాగా గుర్తించారే తప్ప ఏ చర్యలూ ప్రత్యేకంగా తీసుకోలేదు. వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయింపు క్లిష్టంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వలేదు. వచ్చే సీజన్‌కు నీళ్లిస్తామని చెప్పిన సిఎం చంద్రబాబు ఆ దిశగా చర్యలు చేపట్టే అంశంపై దృష్టి సారించలేదు. కనీసం కేంద్రం నుంచైనా దీనికి నిధులు కోరిన దాఖలాల్లేవు. కనిగిరి ప్రాంతంలో ఫ్లోరిన్ సమస్య వీడలేదు. పీసీపల్లి మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఇటీవల వరుసగా మరణిస్తున్నారు. కేవలం తాగునీటి సమస్యతోనే ఈ జబ్బు వస్తోంది. ఇప్పటికీ సాగర్ జలాలను కనిగిరి ప్రాంతానికి అందించడంలో వైఫల్యం కనిపిస్తోంది. ఆ ప్రాంతంపై స్థానిక నేతలు దృష్టి సారించినా ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల్లోనూ నీటి సమస్య వెంటాడుతోంది. చేపట్టిన అనేక ప్రాజెక్టులు పూర్తి కాలేదు. మూడు దశాబ్ధాల క్రితం డిపిఎపి అనే ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. కోట్లాది రూపాయలు వెచ్చించారు. కరువు పీడిత ప్రాంతాల్లో అనేక పనులు చేపట్టారు. అవేవీ ఫలితాలను ఇవ్వలేదు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తితోనే పశ్చిమ ప్రాంతానికి విముక్తి అని ఎప్పటినుంచో రాజకీయ పెద్దలు చెబుతూనే ఉన్నారు. ఇప్పటికీ దీన్ని పూర్తి చేసుకోలేకపోయాం. వెనుకబడిన జిల్లాల నుంచి వేరు చేసిన ప్రాంతాలతో ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అదే తీరున ఉంది. ఏనాడూ జిల్లా అభివృద్ధికి గానీ, వెనుకబాటుతనం అధిగమించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించలేదు. రాష్ట్రస్థాయిలో అమలు చేసే పథకాలే ఇక్కడా అమలు చేస్తున్నారు. అందరితో పాటే మనమూ అన్నట్లుగానే సాగుతున్నామే తప్ప వెనుకబడిన జిల్లాకు ప్రత్యేక చేయూత లేదు. దీని కోసం గళం విప్పే నాథుడు కూడా పాలకపక్షాల్లో కనిపించడం లేదు. ప్రతిపక్ష వైసిపి కూడా రాజకీయ పోరాటాలు తప్ప జిల్లా సమగ్రాభివృద్ధి కోసం.. వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు చేపట్టిన చర్యలు ఏమీ లేవు. ఐదేళ్ల పాలన సాగించినప్పుడు కూడా చర్యలు శూన్యమే అని చెప్పాలి. కేంద్రంలో రెండు పార్టీల లాలూచీ వల్లనే నిధులు రాలేదనే విమర్శలున్నాయి. ఎవరూ గట్టిగా కేంద్రాన్ని నిలదీసే పరిస్థితి లేకనే జిల్లాకు నిధులు ఇవ్వలేదనే వాదన ఉంది. సిపిఎం తదితర వామపక్షాల పోరాటాల ఫలితంగా అప్పట్లో జడ్పీలోనూ తీర్మానం చేశారు. ఇదొక ఎజెండాగా మారింది. పాలక పార్టీలు స్పందించాల్సి వచ్చింది. అసెంబ్లీ నుంచి తీర్మానం కేంద్రానికి పంపారు. ఎట్టకేలకు వెనుకబాటు గుర్తింపుపై ప్రకటన చేశారు. ఇప్పుడు నిధులు కేటాయింపుపైనే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నాం..

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి స్వామి మాట్లాడుతూ పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పి-4 కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం కషి చేస్తున్నారన్నారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, అందులో భాగంగానే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉమ్మడి జిల్లాకు ఒక ప్రత్యేక వైద్యాధికారిని నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం రూ.143 కోట్లతో గురుకులాలు, వసతి గృహాలకు మరమ్మతులు చేసినట్లు తెలిపారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గహాలలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు శరీర దఢత్వానికి, మానసిక ఆనందానికి తోడ్పడతాయన్నారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

ధనిక రైతుకు డీకే పట్టా ఎలా ఇచ్చారో.?

(మొదటిపేజీ తరువాయి)

అవసరం. ఇందుకోసం అడ్డుగా ఉన్న కాలువను పూడ్చి వేసి రహదారి నిర్మాణం చేశారు. మత్స్యకారులు వరస ఆందోళనలు చేస్తున్నా ఎక్కడా లేని విధంగా సముద్రం ఒడ్డున ఉన్న భూములను కూడా రియల్ ఎస్టేట్‌దారుల ధారాదత్తం చేశారు. ఎవరికైనా డికెటి పట్టా ఇచ్చినా ప్రజల ప్రయోజనార్ధం సదరు భూమిని తిరిగి ప్రభుత్వం తీసుకోవచ్చు. సాగు కోసం ఇచ్చిన భూమిని రియల్ ఎస్టేట్ కోసం వినియోగిస్తున్న కారణంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. మత్స్యకారులు కోరుతున్నట్లు చెయ్యవచ్చు. కానీ ఇక్కడ కమిటీలు, విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. సర్వేనెంబర్ 499-2లోని 3.42 ఎకరాల వివాదాస్పద భూమిలోకి ఎవరూ ప్రవేశించరాదని, భూమిపై బిఎన్ఎస్ 163 యాక్ట్ అమలు చేశామని పూర్వ కలెక్టర్ వెంకటమురళి ప్రకటిస్తూ ఆదేశాలిచ్చారు. అయినా అవేవీ ఖాతరు చేయకుండా వెంకట్రావు సముద్రం వరకు రోడ్డు నిర్మించి.. కొబ్బరి మొక్కలు నాటారు. బుర్ల వెంకట్రావు పేరుతో 3.42 ఎకరాలు ఆన్లైన్ చేసే నాటికి అంటే 22 జూన్ 2024 నాటికి సముద్ర తీరం ముందుకే ఉంది. స్ట్రెయిట్ కట్ కాలువ ఆ భూముల నుంచే ప్రవహిస్తోంది. అయినా క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా రెవెన్యూ అధికారులు అయన పేరుతో ఆ భూములు ఆన్‌లైన్ చేశారు. అలలు తాకే తీరంలో, సముద్రపు దిబ్బల మీద ఏ పంటలు సాగు చేస్తారని అధికారులు బుర్ల వెంకట్రావుకి ఆ భూమి కేటాయిస్తూ డీకే పట్టాను మంజూరు చేశారో అర్ధంకాని పరిస్థితి. రీసార్టుల బీచ్ వ్యూ కోసమే మత్స్యకారులకు అన్యాయం చేస్తూ అక్రమంగా ప్రభుత్వ భూమిని కట్టబెట్టినట్లు అర్ధమవుతోంది. జిల్లా రెవెన్యూ అధికారులకు అంతా తెలుసు.. అయినా ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు కమిటీలు, సర్వేలు, కొలతల పేరుతో కాలయాపన చేస్తున్నారు. మూడు రోజుల క్రితం జరిపిన సర్వే అనంతరం సమగ్ర నివేదికను జిల్లా కలెక్టరుకు ఇస్తామన్నారు. మరి తుదిగా ధనిక రైతుకు ఇచ్చిన 3.42 ఎకరాలు డీకే పట్టా విషయమై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది. తమ జీవనం, సుదీర్ఘ ప్రయోజనాల కోసం డికె పట్టా రద్దు చేసి.. కాలువను పునరుద్ధరించి మేలు చేయాలని మత్స్యకారులు వేడుకుంటున్నారు.

యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

వీరాంజనేయులుకు సతీవియోగం



నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులుకు సతీ వియోగం కలిగింది. ఆయన సతీమణి శ్రీలక్ష్మి (58) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ గురువారం సాయంత్రం మృతిచెందారు. స్థానిక కృష్ణ మందిర్ వద్ద తమ నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఎం.ఎ,ఎంఎల్ఐ ఎస్‌సి గోల్డ్ మెడల్ సాధించిన శ్రీలక్ష్మి స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో గత 30 ఏళ్ళు గా జూనియర్ సెక్రటరేయట్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. వీరికి కుమారుడు సాయి చక్రధర్ (సాఫ్ట్ వేర్ ఇంజినీర్), కుమార్తె డాక్టర్ మానస గౌతమి ఉన్నారు. శ్రీలక్ష్మికి శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు...

మృతదేహం కిమ్స్ ఆసుపత్రికి తరలింపు..

అమెరికాలో ఉన్న శ్రీలక్ష్మి కుమార్తె డాక్టర్ మానస గౌతమి ఒంగోలు రావడం ఆలస్యవుతున్న కారణంగా వైద్య నిపుణుల సూచనలు మేరకు మార్చురీలో భద్రపరచేందుకు మతదేహం కిమ్స్ ఆసుపత్రి తరలించారు. శనివారం ఉదయం 9 గంటలకు మాత్రమే తమ నివాసం వద్ద బంధుమిత్రుల సందర్శ నార్ధం ఉంచుతారు. 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.



శ్రీలక్ష్మి (ఫైల్)

సిపిఎం నేతల నివాళి....

శ్రీలక్ష్మి మృతి గురించి సమాచారం తెలుసుకున్న సిపిఎం నేతలు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. నివాళులర్పించిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జివి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు,ఎం.రమేష్, జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు జి.రమేష్, సీనియర్ నాయకులు వై. సిద్ధయ్య,ఎస్ డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు అయ్యపరెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్.జయప్రకాష్, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురామ్, శ్రామికమహిళ జిల్లా కార్యదర్శి పెంట్యాల కల్పన, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.రాంబాబు, జి.శేషయ్య, బివి.రావు విశ్రాంత ప్రిన్సిపల్ ఎవి. పుల్లారావు, ఎస్ఎఫ్ఐ నాయకుడు సిహెచ్.వినోద్ ఉన్నారు.

యుటిఎఫ్ నేతల నివాళి

శ్రీలక్ష్మి మృతదేహాన్ని యుటిఎఫ్ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులరించార. నివాళులర్పించిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు,జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సహాధ్యక్షులు జి.ఉమామహేశ్వరి, ఐవి.రామిరెడ్డి, ప్రధానకార్యదర్శి ఎస్‌కె.అబ్దుల్ హై, కోశాధికారి ఎన్.చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ప్రభాకరరెడ్డి, ఎం.సంధ్యారాణి, టి. వెంకటేశ్వర్లు,కె. లక్ష్మీనారాయణ, సిహెచ్. ఉమామహేశ్వం రావు, ఎం.జయరామిరెడ్డి, సిహెచ్.మురళి, వై.వెంకట్రావు, జి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసులు, జి.హరిబాబు తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి- చీమకుర్తి

ఎక్సైజ్ సురక్ష యాప్‌లో స్కాన్ చేసి మద్యం విక్రయించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ ఎం. సుకన్య తెలిపారు. మద్యం షాపులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌లో స్కాన్ చేసి మద్యం విక్రయించాలన్నారు. వినియోగదారులు తాము కొనుగోలు చేసే మద్యం సీసా లను ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌లో తనిఖీ చేసుకోవచ్చు తెలిపారు. ఎంఆర్‌పి ధరలకే మద్యాన్ని విక్రయించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మకం సరళిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లిలో 'పొలంబడి'

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండల పరిధిలోని కామేపల్లి గ్రామంలో ఆత్మ సౌజన్యంతో కంది పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు - ఫార్మ్ ఫీల్డ్ స్కూల్ - పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ కంది పంటలో ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. పురుగు గుడ్ల నివారణ కోసం వేప నూనె 5ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. 13-0-45 ఎకరాకు కేజీ వంతున పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బ్లాక్ టెక్నికల్ మేనేజర్ షాఫ్రుదిన్, గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం స్థాపించి 14 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమలో కందుకూరు డివిజన్ మాల మహానాడు మరియు మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిటితోటి శ్రీరాములు, అంబేద్కర్ కమిటీ అధ్యక్షుడు పుల్లగూరి కష్ణయ్య, ఉపాధ్యక్షుడు చొప్పర వెంకన్న, ఆరేటి లక్ష్మీనారాయణ, అల్లు వెంకటేశ్వర్లు, రామకోటయ్య, శ్రీను, కొండయ్య, పీవీ.రెడ్డి, తిరుపతి, మల్యాద్రి, దేవరపల్లి కోటిలింగం, రాంబాబు, నరసింహం పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి అర్హతపై విచారణ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్న కాలంలో బిఇడి చదివి ఎయిడెడ్ స్కూల్ ఉపాధ్యాయురాలిగా నియమితులైన పొన్నూరు అనురాధ అర్హతలపై డిప్యూటీ డిఇఒ చంద్రమౌళేశ్వరావు గురువారం విచారణ చేపట్టారు. అందిన వివరాల ప్రకారం.. అనురాధ తాళ్లూరు మండలం మన్నేపల్లి సచివాలయంలో విలేజ్ సర్వేయర్‌గా పనిచేస్తూ బోగస్ సర్టిఫికెట్‌తో 2023 లో నాగులుప్పలపాడు మండలం చేకూరపాడు ఎస్‌ఇఎస్ఒ ఓరియంటల్ హైస్కూల్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందినట్లు ఎంఎస్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఈ అంశం పై సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా విద్యాశాఖను ఆదేశించారు. జిల్లావిద్యాధికారి కిరణ్ కుమార్, డిప్యూటీ డిఇఒ చంద్రమౌళేశ్వరావును విచారణ అధికారిగా నియమించారు. అందులో భాగంగా డిప్యూటీ డిఇఒ చంద్రమౌళేశ్వరావు గురువారం అనురాధ మరియు సుజన్ మాదిగను వేర్వేరుగా విచారించారు. ఉద్యోగం వచ్చేనాటికి తాను బిఇడి మొదటి సెమిస్టరు పూర్తి చేశానని, అనంతరం కోవిడ్ కాలంలో మిగతా సెమిస్టర్లు పూర్తి చేసినట్లు అనురాధ రాత పూర్వకంగా విచారణ అధికారికి అందజేసినట్లు సమాచారం. 2020 డిసెంబర్ 16న సచివాలయ సర్వేయర్ ఉద్యోగంలో చేరిన అనురాధ ప్రభుత్వం నుంచి అనుమతి పొందకుండా నిబంధనలు ప్రకారం సెలవు పెట్టకుండా సర్వీసులో కొనసాగుతూ 2021అక్టోబర్‌లో బిఇడి పూర్తి చేసినట్లు సుజన్ మాదిగ, త్యాగరాజు, కొలకలూరి విజయ్ కుమార్, తేళ్ల జయరాజ్, కత్తి శేషారావు, ఒంగోలు నగర యాదవ జేఏసీ అధ్యక్షుడు దూళ్లఅప్పారావు యాదవ్ ఆధారాలతో సహా డిప్యూటీ డిఇఒకు అందజేశారు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందడమే గాకుండా, ప్రభుత్వాన్ని పక్కదారి పట్టించిన అనురాధను ఉద్యోగం నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. విచారణ నివేదికను జిల్లా విద్యాధికారికి అందజేయనున్నట్లు డిప్యూటీ డిఇఒ తెలిపారు. అనురాధ 2023 డిసెంబర్ 6న సచివాలయ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు సమాచారం. స్కూల్ అసిస్టెంట్‌గా నియమితులైన అనురాధకు స్కూల్ అసిస్టెంట్‌కు సంబందించిన టెట్ విద్యార్హత సర్టిఫికెట్ లేదని స్కూల్ మేనేజ్ మెంట్ జీతం బిల్లు పెండింగ్ లో పెట్టినట్లు తెలిసింది. ఈ విషయంపై అనురాధ కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

నీటి సమస్యను పరిష్కరిస్తా : ఎంపిడిఒ

ప్రజాశక్తి మద్దిపాడు

నీటి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఎంపిడిఒ జ్యోతి తెలిపారు. మండల పరిధిలోని నందిపాడు గ్రామంలో స్కూటర్ పై పర్యటించారు. గత కొన్ని రోజులుగా గ్రామస్తులు నీటి సమస్యను ఎదుర్కొం టున్నట్లు ఎంపిడిఒ దృష్టికి వచ్చింది. అందులో భాగంగా ఎంపిడిఒ గ్రామానికి వెళ్లి నీటి సరఫరాకు కలుగుతున్న ఇబ్బందుల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో సమస్యగా మారిన మోటార్‌ను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బావి వద్దకు ఆమె స్వయంగా స్కూటర్ పై వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జ్యోతి మాట్లాడుతూ త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఎంపీడీవో వెంట సిబ్బంది ఉన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న ఎంపిడిఒ

కడుపునొప్పి తాళలేక..

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-టంగుటూరు

కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత ఎలుకల మందు పేస్టు తిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని కారుమంచి గ్రామంలో గురవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వహీద గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. చికిత్స చేయించుకున్నప్పటికీ కడుపు నొప్పి తగ్గలేదు. ఈ క్రమంలో బుధవారం కడుపునొప్పి మరింత ఎక్కువైంది.కడుపునొప్పి భరించలేక వహీద ఎలుకల మందు పేస్టు తింది. ఈ విషయాన్ని గమనించిన వహీద భర్త అరవింద్ ఒంగోలులోని ప్రకాశం హాస్పటల్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. టంగుటూరు పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేశారు. ఒంగోలు జిజిహెచ్‌లో టంగుటూరు తహశీల్దార్ జి.ఆంజనేయులు శవ పంచనామా నిర్వహించారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి క్లస్టర్ పరిధిలోని పొందూరు గ్రామానికి చెందిన రైతులు 1060 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 864 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 196 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.316, అత్యల్ప ధర రూ.70, సరాసరి ధర రూ.242-23 పైసలు పలికింది. పొగాకు వేలం లో 19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు..

కొండపి: కొండపి పొగాకు వేలం కేంద్రానికి క్లస్టర్ పరిధిలోని అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, ఎద్దకండ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు 1,253 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 846 బేళ అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 407 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.315, కనిష్ట రూ. 70, సరాసరి ధర రూ. 220.11 పైసలు పలికింది. వేలంలో 17 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్లు వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకూ ఈనెల 22 నుంచి నవంబర్ 12 వరకూ నిర్వహిస్తున్న బస్సు జాతాను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ పిలుపునిచ్చింది. స్థానిక మల్లయ్య లింగయ్య భవన్‌లో బస్సు జాతాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుల్లాయిస్వామి, ఉపాధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలహీనపరిచే చర్యలను నిలిపివేయాలన్నార. రూ.6400 కోట్ల ఫీజు రీయి ంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ కల్యాణ్, నాయకులు తాహిద్, ఇఫ్రాజ్, లోకేష్, స్టాలిన్, సన్నీ పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

ప్రజాశక్తి-కొండపి

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ప్రయోజనం చేకూరిందని ఆర్టీవో సిఐ ఎన్.నాగదీష్ తెలిపారు. జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ తహశీల్దారు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకూ గరువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగదీష్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ఎలక్ట్రికల్ వస్తువుల ధరలు కొంతమేర తగ్గాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో ఎస్ఐ బి.బానుప్రకాష్, టిడిపి మండల అధ్యక్షుడు వసంతరావు, ఉపసర్పంచి కూనంనేని వాసంతి, పంచాయతీ కార్యదర్శి రాంమోహన్‌రావు, కూనంనేని రమేష్, యనమద్ని వెంకటేశ్వర్లు, కాలేషా, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు పెన్షన్ డ్యూటీ తొలగించాలి


ఎంపిడిఓకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అంగన్‌వాడీలకు ఐసిడిఎస్‌తో సంబంధం లేని పనులకు వినియోగించవద్దని, పెన్షన్ డ్యూటీలు వేయవద్దని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలని కోరుతూ ఎంపిడిఒకు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు వాక గృహలక్ష్మి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పి మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఆగస్టు నెలలో అంగనవాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ఐసిడిఎస్‌కు సంబంధంలేని పనులు, పెన్షన్ డ్యూటీలను వేయవద్దని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్ట్ నుంచి ఉత్తర్వులు వచ్చి రెండు నెలలైన అంగన్వాడీలకు పెన్షన్ డ్యూటీలు వేస్తున్నారని అన్నారు. వాటి వలన అంగన్వాడీలు చేయవలసిన పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని అన్నారు. మండలంలో అంగన్వాడీలకు పెన్షన్ డ్యూటీలు వేయకుండా డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలని కోరారు. నవంబర్ నెల నుండి అంగన్‌వాడీలు పెన్షన్ డ్యూటీలకు హాజరుకారని, వారి స్థానాల్లో మరొకరిని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో భట్టిప్రోలు, వెల్లటూరు సెక్టార్ల నుండి రూపరాణి, భద్రకాళి, వరలక్ష్మి, వాణి వెంకటరమణ, కాంతమ్మ, వెంకటేశ్వరమ్మ, రత్నకుమారి, శివ పాల్గొన్నారు.

కొల్లూరు : పెన్షన్ డ్యూటీలు రద్దు చేయాలని కోరుతూ ఎంపిడిఒ నరసింహారావుకు సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం గురువాఆరం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ అంగన్వాడీలను పెన్షన్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. మహిళల అభివృద్ధి, సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు నీరజ, వనజ, సౌభాగ్యం, లక్ష్మీ, కాశివిశ్వసాక్షి పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తునన సిఐటియు నాయకులు


కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి


వినతి పత్రం అందజేస్తున్న కౌలు రైతు నాయకులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి రూ.20వేలు ఇవ్వాలని తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గొల్ల నాగరాజు మాట్లాడారు. ప్రస్తుతం కౌలు రైతులు ఎక్కువ మంది వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. రైతులతో సంబంధం లేకుండా కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న ప్రతి ఒక్కరికి సిసిఆర్సి కార్డు ఇవ్వాలని అన్నారు. కౌలు రైతుకు సిసిఆర్సి కార్డ్ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అర్హత లేకుండా ఉండడంతో ఈ క్రాప్ నమోదు చేయడం లేదన్నారు. పంటలు అమ్ముకోవడానికి కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్యాంక్ అధికారులతో మాట్లాడి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం సిసిఆర్సి కార్డు పొందిన కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జి సుధాకర్, రాంబాబు, మురగుడ సత్యనారాయణ, పి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై ఆకస్మిక తనిఖీ


మాట్లాడుతున్న ఇఇ ఎన్ మస్తాన్

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అద్దంకి సబ్ డివిజన్ ఇఇ ఎన్ మస్తాన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ విద్యుత్ వినియోగ దారులు స్వచ్ఛందంగా రిజిస్ట్రేషన్ చేసుకుని బిల్లును సకాలంలో చెల్లించి మెరుగైన విద్యుత్తు అందించడానికి అధికారులతో సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా విధ్యుత్ వాడుతున్న విద్యుత్ వినియోగదారులపై తనిఖీల్లో రూ.49,200 పెనాల్టీ విధించినట్లు తెలిపారు. ఎఇ సురేష్ బాబు మాట్లాడుతూ వినియోగదారులు పిఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకుని ఉచిత విద్యుత్తు పొందాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఇ విజయ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మా పరిధిలో నకిలీ మద్యం విక్రయాలు లేవు

'ప్రజాశక్తి'తో ఎక్సైజ్ ఎస్ఐ విష్ణువర్ధనరెడ్డి


ఎస్ఐ ఎస్ విష్ణువర్ధనరెడ్డి

ప్రజాశక్తి - పంగులూరు

ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్కడ నకిలీ మద్యం లేదని, ప్రజలు అపోహపడి అబద్ధాలు నమ్మవద్దని ఎక్సైజ్ ఎస్ఐ ఎస్ విష్ణువర్ధనరెడ్డి అన్నారు. ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. తమ పరిధిలో 24 మద్యం షాపులు, ఒక బార్ ఉందని చెప్పారు. స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు నకిలీ మద్యం కేసులు ఒకటి కూడా రాలేదని అన్నారు. నకిలీ మద్యం తమ పరిధిలోకి రాకుండా ఉండేందుకు తాము జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. మద్యం దుకాణాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు మద్యం బాటిళ్లను రసాయన పరీక్షల కోసం పంపిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 143 సార్లు తనిఖీలు నిర్వహించి, 83 సార్లు రసాయన పరీక్షల కోసం బాటిళ్లను పంపామని అన్నారు. మద్యం నాణ్యమైందిగా, ఎలాంటి కల్తీ లేనిదిగా తేలిందని చెప్పారు. కాబట్టి నకిలీ మద్యమని ప్రస్తుతం జరుగుతున్న పుకార్లను ప్రజలు నమ్మవద్దని కోరారు. ఇటీవల సిఎం చంద్రబాబు ఎపి ఎక్సైజ్ సురక్ష అనే మొబైల్ అప్లికేషన్‌ను విడుదల చేశారని, ప్రజలు ఈ అప్లికేషను డౌన్లోడ్ చేసుకుని మద్యం బాటిళ్లపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే దాని వివరాలు వస్తాయని చెప్పారు. మద్యం దుకాణాల లైసెన్సు దారులు షాపు నిర్వాహణలో ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలు పాటించాలని కోరారు. ఉదయం 10 నుండి రాత్రి 10 వరకు మాత్రమే తెరచి ఉంచాలని చెప్పారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని తెలిపారు. కాలం చెల్లిన బీరు, మద్యం అమ్మితే నేరమని చెప్పారు. గ్రామాల్లో ఎక్కడ బెల్ట్ షాపులు లేవని అన్నారు. లైసెన్స్ షాపుల నుండి మూడో వ్యక్తులు మద్యం అమ్మకాలు జరపకూడదని చెప్పారు. ఎవరైనా ఈ నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనధికారికంగా మద్యం విక్రయాలు తెలిపితే కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు విధిస్తామని అన్నారు. మద్యం అక్రమ అమ్మకాల సమాచారం తెలిస్తే 62812 88914, 94409 02497 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.


ఎంజె మాణిక్యరావు శత జయంతి ప్రచారంలో నాయకులు

నేడు మాణిక్యరావు జయంతి

ప్రజాశక్తి - చీరాల

ఉపాధ్యాయ, అధ్యాపక ఉద్యమ నిర్మాత, మాజీ ఎమ్మెల్సీ ఎంజె మాణిక్యరావు సేవలు నేటి తరానికి ఆదర్శమని జెవివి సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. నేడు మాణిక్యరావు శత జయంతి ఉత్సవాలు శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక సెయింట్ మార్క్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎదుర్కొన్న అనేక సమస్యల పరిష్కారానికి మాణిక్యరావు జీవితాంతం పోరాడి, ఉద్యమాలకు మార్గదర్శకుడిగా నిలిచారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పుష్పరాజు, విస్తర్ల విజయకుమార్, చేతి వృత్తి దారుల సంఘం నాయకులు పి కొండయ్య, కోటయ్య, కనక మోహనరావు, రాఘవాచారి పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న లతా హాస్పిటల్ డాక్టర్ శేఖర్

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని నవాబు పేటలో లతా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజేష్ మాట్లాడారు. నిరు పేదలకు నాణ్యమైన వైద్యం అందించడం తమ హాస్పిటల్ లక్ష్యం అన్నారు. సామాజిక సేవలో భాగంగా పేదల నివాస ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాజరైన వారికి రక్తపోటు, షుగర్, కంటి, హృదయ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


బియ్యం బహుకరిస్తున్న రోటరీ ప్రతినిధులు

పేదలకు బియ్యం బహుకరణ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా కట్టెబోయిన రవీంద్ర బాబు ఆర్థిక సౌజన్యతో అద్దంకిలోని ఇద్దరు పేద మహిళలకు రెండు టిక్కీలు బియ్యం వితరణ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణచంద్రరావు, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, పిఎల్‌వి నరసింహారావు, అద్దంకి లేవి ప్రసాద్, చప్పిడి వీరయ్య, పువ్వాడ రామకోటేశ్వరావు, గూడా లక్ష్మీరెడ్డి, చిన్ని కామేశ్వరావు పాల్గొన్నారు.

19న 'మట్టి రంగు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల

ప్రముఖ కవయిత్రి, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ 'ఉగాది పురస్కార' గ్రహీత చిల్లర భవానీ దేవి రచించిన 'మట్టి రంగు' కవితా సంపుటి పుస్తకావిష్కరణ ఈ నెల 19న స్థానిక హోటల్ గౌతం వేదిక హాల్లో నిర్వహిస్తున్నట్లు రచయితల సంఘం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు తిమ్మన శ్యాంసుందర్ గురువారం తెలిపారు. ఎపి రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే 59వ పుస్తకావిష్కరణ సభకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ హాజరు కానున్నట్లు తెలిపారు. సాహిత్యాభిమానులు పాల్గొనాలని కోరారు.



వర్క్ షాపులో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

ఎమర్జింగ్ ఇంజనీర్స్‌పై వర్క్ షాపు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆర్కిటెక్టింగ్ ది క్లౌడ్ ఎడబ్ల్యుఎస్ ఫర్ ఎమర్జింగ్ ఇంజినీర్స్‌పై మూడు రోజుల వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. సైబర్ సెక్యూరిటి విభాగం ఆధ్వర్యంలో బిటెక్ 4వ సంవత్సరం విద్యార్థులకు మూడు రోజుల వర్క్ షాపు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. విక్షా టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ జిఎం సిహెచ్ గోపిరాజు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు సైబర్ సెక్యూరిటి విభాగాధిపతి డాక్టర్ ఎస్ ఇంద్రనీల్ తెలిపారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ నిర్వహించే క్లౌడ్ కంప్యూటింగ్ ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ సి సుబ్బారావు పాల్గొన్నారు.


ప్రమాణం చేస్తున్న ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం

ఎపిటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన ఎపిటిఎఫ్ మండల సర్వ సభ్య సమావేశంలో నూతన కమిటీ ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షులు ఆరే శ్రీనివాసరావు తెలిపారు. అధ్యక్ష, ప్రధాన కార్యార్యులు తన్నీరు వెంకట్రావు, షేక్ రహంతుల్లా, జిల్లా కౌన్సిలర్లు కెవికె నరసింహమూర్తి, కంకణాల శ్రీనివాసరావు, బాచిన లలిత కుమారి, రావూరి వెంకట సుబ్బారావు ఎన్నికైనట్లు తెలిపారు. కరి రామయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించినట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ చెంచు రామారావు, రాష్ట్ర కౌన్సిలర్ జంపని వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు బాచిన నారాయణ, గుర్రం లక్ష్మీ వరప్రసాద్ పాల్గొన్నారు.

19న హేతువాద సంఘం మహాసభలు

ప్రజాశక్తి - బాపట్ల

హేతువాద సంఘం జిల్లా 3వ వార్షిక మహాసభలు ఈ నెల 19న చీరాలలో నిర్వహించనున్నట్లు హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు కరణం రవీంద్రబాబు గురువారం తెలిపారు. చీరాల పట్టణంలో రైల్వే ఫ్లై ఓవర్ క్రింద జరిగే సభ, మానవవాద అధ్యయన తరగతులకు హేతువాద సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు.

సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దారుణం : సిపిఎం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు తంబి శ్రీనివాసులు, ఎస్‌డి. హుస్సేన్‌తో కూడిన బందం ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర కళాశాల హాస్టళ్లను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎస్‌టి బాలుర హాస్టల్ ఆవరణం పిచ్చి మొక్కలలో నిండి పోయిందన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండటంతో తేళ్లు, పాములు హాస్టల్‌లోకి వస్తున్నాయన్నారు. విద్యార్థులు ఆరుబయటే స్నానం చేయాల్సి వస్తుందన్నారు. వాతావరణం చల్లగా మారినప్పటికి ప్రభుత్వం పంపిన దుప్పట్లు ఇవ్వకుండా హాస్టల్ సిబ్బంది దాచిపెట్టారని ఆరోపించారు. మామిడిపాలెంలోని ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్‌లో వెంటనే రిపేర్లు చేపట్టి డ్రైనేజీ కాలువలను శుభ్రపరచాలన్నారు. బీసీ బాలుర కాలేజీ హాస్టల్‌కు సొంత భవనం ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవాలంటే సాంఘిక సంక్షేమ మంత్రి కేవలం పర్యటనలు చేయడం సరిపోదని, హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల స్థితిగతులను స్వయంగా తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల జీవన పరిస్థితులు మెరుగుపడే వరకేఉ సిపిఎం పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.



ఒంగోలులో విద్యార్థులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



అమ్మనబ్రోలులో అల్పాహారం రుచి చూస్తున్న నాయకులు

సౌకర్యాలు మెరుగుపరచాలి

నాగులుప్పలపాడు : సంక్షేమ హాస్టల్లో సౌకర్యాలు మెరుగు పరచాలని సిపిఎం జిల్లా నాయకులు జె. జయంతి బాబు కోరారు. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామంలోని ప్రభుత్వ ఎస్‌సి హాస్టల్‌ను సిపిఎం బందం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో భోజన వసతులు , సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా జయంతిబాబు మాట్లాడుతూ మరుగుదొడ్లు పల్లపు ప్రాంతంలో ఉండటం వల్ల వర్షాకాలంలో నీరు నిలిచి విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది. గదుల్లో ఫ్లోరింగ్ సక్రమంగా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఫ్లోరింగ్‌కు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. విద్యార్థులకు అందిస్తున్న కోడిగ్రుడ్లు ప్రభుత్వమే సరపరా చేయాలన్నారు. తాగు నీరు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. హాస్టల్‌న సందర్శించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్ ,రావెళ్ళ వెంకట్రావు , మల్లవరపు శ్రీను , కె. వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.



కంకణాల రమాదేవి



సయ్యద్ షర్మిల

ఐద్వా రాష్ట్ర కమిటీలో జిల్లాకు చోటు

రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కె.రమాదేవి

రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా సయ్యద్ షర్మిల

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఐద్వా రాష్ట్ర కమిటీలో ప్రకాశం జిల్లాకు ఇద్దరికి చోటు దక్కింది. ఈనెల 13 నుంచి 15 వరకు అనంతపురంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 16వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందులో జిల్లా చెందిన కంకణాల రమాదేవి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సయ్యద్ షర్మిల రాష్ట్ర కమిటీ సభ్యురాలుగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో 2026 జనవరిలో నిర్వహిస్తున్న జాతీయ మహాసభలకు రమాదేవిని ప్రతినిధిగా ఎన్నుకోవడం విశేషం. రాష్ట్ర కమిటీకి ఎన్నికైన రమాదేవి, షర్మిలకు వివిధ ప్రజా సంఘాలు, మహిళా సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

నేడు టేబుల్ టెన్నిస్ సెలక్షన్స్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 69వ స్కూల్ గేమ్స్ టేబుల్ టెన్నిస్ సెలక్షన్స్ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు సిహెచ్. వెంకటేశ్వర్లు, ఎ. శిరీష కుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 బాలురు మరియు బాలికలు ఈ సెలక్షన్స్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నార. వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ ఎన్‌టి. ప్రసాద్ 9848575494లో సంప్రదించవచ్చునని తెలిపారు.



మాట్లాడుతన్న చుండూరి రవిబాబు

సంతకాల సేకరణ

ప్రజాశక్తి- కొత్తపట్నం

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ పార్టీ ఒంగోలు నియోజక వర్గ ఇన్‌ఛార్జి చుండూరు రవిబాబు తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో మండల పరిధిలోని మోటుమాల గ్రామంలో గురువారం సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరంలో ఉంటుందన్నారు.ప్రజలకు ఉచిత వైద్యం అందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి , ఈతముక్కల ఎంపిటిసి రవి, స్థానిక సర్పంచి గోపి, వైసిపి గ్రామ అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు శ్రీనివాసులు రెడ్డి ,సిహెచ్.బ్రహ్మయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంగా ఉంటేనే దేశాభివృద్ధి

కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, గ్రామం, రాష్ట్రం, దేశం అభివద్ధి చెందుతుందని, అందులో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. మహిళాభివద్ధి మరియు శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉందన్నారు. పోషకాహారం అందించడంలో అంగన్‌వాడీలు కీలకపాత్ర పోషించాలన్నారు.6 సంవత్సరాల లోపు పిల్లలకు సరైన బలవర్ధక ఆహారం అందినప్పుడే మానసిక, శారీరకంగా అభివద్ధి సాధ్యమవుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి తల్లి ఆరోగ్యమైన బిడ్డను సమాజానికి అందించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ పౌష్టికాహారంపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. చిన్నారులు రైమ్స్ పాడడం, ప్రశ్నలకు సమాధానాలు చెప్పడాన్ని కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. అనంతరం అన్నప్రాసన, సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ సువర్ణ, మెప్మా పీడీ శ్రీహరి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భాగీదర, న్యూట్రిషన్ నిపుణుడు డాక్టర్ రవీంద్రకుమార్, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, అంగన్‌వాడీలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ రాజాబాబు



నిత్యావసరాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

తల్లితండ్రులను కోల్పోయి అమ్మమ్మ సంరక్షణలో ఉంటూ అంగవైకల్యంతో బాధపడుతున్న వేటగిరి బాలకోటయ్యకు నెలకు సరిపడ నిత్యావసర సరుకులు యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని మల్లికార్జున నగర్‌కు చెందిన వేటగిరి బాలకోటయ్యకు కాళ్ళు, చేతులు పనిచేయవు. మరో వ్యక్తి సహాయం లేనిదే ఎపని చేసుకోలేని స్థితి. అనారోగ్య సమస్యలతో పాటు, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం గురించి తెలుసుకున్న యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యుడు దేవరపల్లి చంద్రశేఖర్ స్పందించి నిత్యావస సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-కొండపి : పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని అంగన్‌వాడీలు తెలిపారు. మండల పరిధిలోని దాసిరెడ్డిపాలెం గ్రామంలో పోషకాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కిషోర బాలికలు, గర్భిణులు, గ్రామస్తులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. నవజాత శిశువు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు సిహెచ్.సరితాదేవి, ప్రమీల, ఆదిలక్ష్మి, మస్తానమ్మ, శేషమ్మ, విజయ నిర్మల పాల్గొన్నారు.

శిద్దా సుధీర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -చీమకుర్తి


రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీయల్ డివిజన్ ఉపాధ్యక్షుడు, గెలాక్సీ గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శిద్దా సుధీర్ కుమార్ పుట్టినరోజు వేడుకలు సేవా కార్యక్రమాలతో గురువారం నిర్వహించారు. స్థానిక హరిహర క్షేత్రంలో గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఎ. గిరిబాబు, కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేకును రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతుల సమక్షంలో సతీమణి శిద్దా శృతితో కలిసి సుధీర్ కట్ చేశారు. అనంతరం పాటిమీద పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణ కోసం గ్యాస్ కొనుగోలు నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. పాఠశాలలో నెట్ సౌకర్యానికి పరికరాలు అందజేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. బండ్లమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. దర్శి నియోజకవర్గం, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో శిద్దా అభిమానులు తరలివచ్చి సుధీర్ కుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవీ గ్రానైట్స్ అధినేత శిద్దా పాండురంగారావు, శిద్దా సుధాకర్ , శిద్దా ఆంజనేయ వరప్రసాద్ , శిద్దా పవన్ కుమార్, నాయకులు కాంట్రగడ్డ రమణయ్య ,కందిమల్ల గంగాధర్ రావు, కవుత్రపు రాఘవరావు, గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ గిరిబాబు, కామాక్షి గ్రానైట్ మేనేజర్ అనిల్ కుమార్ రెడ్డి, బల్లికువర లక్ష్మి గ్రానైట్స్ మేనేజర్ ఉప్పుటూరి కృష్ణారావు, గ్రానైట్ వ్యాపారులు నల్లూరి సత్యనారాయణ, మండవ ట్రాన్స్‌ఫోర్ట్ అధినేతలు మండవ శ్రీనివాసరావు, మండల గోపి, యువ పారిశ్రామికవేత్తలు గ్రంధి శ్రీహరి, నూకల సురేంద్ర ,సిహెచ్. హనుమంతరావు, జ్యోతి గ్రానైట్ సీఈవో శివరాం,ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు నెట్ సౌకర్యాన్ని అందజేస్తున్న శిద్దా సుధీర్ కుమార్



కేక్ కట్ చేస్తున్న శిద్దా సుధీర్ కుమార్ దంపతులు



సుధీర్ కుమార్ దంపతులను గజమాలతో సన్మానిస్తున్న బల్లికువర లక్ష్మి గ్రానైట్ ఇన్‌ఛార్జి ఉప్పుటూరి కృష్ణారావు

పేదలకు వైద్య విద్య దూరం చేసే కుట్ర

వైసిపి ఇన్‌ఛార్జులు గాదె మధుసూదనరెడ్డి, కరణం వెంకటేష్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గాదె మధుసూదనరెడ్డి

ప్రజాశక్తి - ఇంకొల్లు

వైద్య కళాశాలలు ప్రవేటీకరణ చేయడమంటే పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేయడమేనని వైసిపి ఇన్చార్జి గాదె మధుసూదనరెడ్డి ఆరోపించారు. మండలంలోని పావులూరులోని తన నివాసం వద్ద గురువారం ఏర్పాటు చేసిన వైసిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. మాజీ సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి అధికారంలో ఉండగా రాష్ట్రంలో వైద్యం తోపాటు వైద్య విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో 17 వైద్య కళాశాలల స్థాపనకు పూనుకున్నారని అన్నారు. వాటిలో ఐదు కాలేజీలు అప్పట్లో ప్రారంభించారని, మిగిలిన 12కాలేజీలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ కాలేజీలను పిపిపి పేరుతో ప్రవేట్ పరం చేయటానికి పూనుకోవడం దుర్మార్గమని అన్నారు. అందుకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా వైసిపి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్, ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరించరు. కార్యక్రమంలో వైసిపి ఇంకొల్లు, యద్దనపూడి, పర్చూరు మండలాల కన్వీనర్ చిన్ని పూర్ణచంద్రరావు, రావూరి వేణుబాబు, కటారి అప్పారావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు నూతలపాటి బలరాం, కొల్లా చౌదరి, మువ్వల రాంబాబు, పల్లెపోగు ప్రసాద్, దాసరి వెంకట్రావు, చిగురుపాటి శ్రీను, గుంటూరు శీను, గోపతోటి బాబురావు, పులగం చందు, అమర్ పాల్గొన్నారు.

చీరాల : ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయటం విద్యా హక్కులపై దాడి చేయడమేనని వైసిపి ఇన్చార్జ్ కరణం వెంకటేష్ బాబు అన్నారు. పిపిపి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ పట్టణంలోని 7వ వార్డులో ప్రారంభించారు. ప్రైవేటీకరణతో విద్యా హక్కుపై దాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు యాదవ మేరి బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్

దీపావళి మందుల దుకాణాలు పరిశీలన


దుకాణంలో పరిశీలిస్తున్న డిఎస్‌పి మొయిన్

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని రెండు దీపావళి హెూల్ సేల్ దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. దుకాణంలో నియమ నిబంధన ప్రకారం ఉన్నాయా లేదాని పరిశీలించారు. దుకాణదారుల లైసెన్సులు, దీపావళి మందులు ఎలా ఉన్నాయి, దుకాణానికి సంబంధించి రక్షణ చర్యల వివరాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీఒ చంద్రశేఖర్ నాయుడు, డిఎస్పి మహ్మద్ మొయిన్, తహశీల్దారు నాగరాజు, ఇంకోలు సీఐ వైవి రమణయ్య, ఎస్ఐ ఖాదర్ భాష ఉన్నారు.

బాపట్ల : మండలంలోని గ్రామాల్లో దీపావళికి బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చీరాల : దీపావళి పండుగ సందర్భంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని చీరాల, వేటపాలెం, కారంచేడు మండలాల్లో క్రాకర్స్ గోదాములపై ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్డిఒ చంద్రశేఖర్ నాయుడు, డీఎస్పీ అబ్దుల్ మోయిన్, అగ్నిమాపక ఎడి రామకృష్ణ దుకాణాల్లో భద్రతా ప్రమాణాలు పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చీరాల, వేటపాలెం, కారంచేడు తహశీల్దార్లు గోపి కృష్ణ, గీతా, నాగరాజు పాల్గొన్నారు.


టపాసుల గోదాము పరిశీలిస్తున్న ఆర్డీఒ చంద్రశేఖర్

శివనగర్ కాలనీలో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - కనిగిరి

మున్సిపాలిటీ పరిధిలోని శివనగర్ కాలనీలో పారిశుధ్య పరిస్థితులు అధ్వాన్నంగా మారాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సైడ్ కాలువలు పూడికతీత చేయకపోవడంతో మురుగు నీరు, చెత్త నిల్వలు పెరిగి దుర్వాసన వెదజల్లుతుంది. కాలువలపై చెత్త పేరుకుపోయింది. పరిసరాలు మురికిగా మారడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివాసాల మధ్య పిచ్చి చెట్లు పెరగడంతో రాకపోకలు కష్టంగా మారింది. చెత్త నిల్వల కారణంగా దోమలు పెరిగి, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం పెరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి పారిశుధ్య కార్మికులు రాకపోవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. శివనగర్ కాలనీ పరిసరాలు ప్రస్తుతం చెత్త డంపింగ్ యార్డ్‌లను తలపిస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, మురుగు నీరు నిల్వలు కనిపిస్తుండటంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కనీసం ఒక్కసారి చూసి చర్యలు తీసుకోవాలని ప్రజలు వాపోతున్నారు. అధికారులు తక్షణమే పారిశుధ్య పనులు ప్రారంభించి, కాలువల్లో పూడికతీత, చెత్త తొలగింపు, దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


డంపింగ్ యార్డులను తలపిస్తున్న నివాస ప్రాంతాలు


మాట్లాడుతున్న రెడ్‌స్టార్ నాయకులు బాషా

రాజ్యాధికారంపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల రాజ్యాధికారంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రెడ్‌స్టార్ కేంద్రకమిటి సభ్యులు బాషా అన్నారు. మండలంలోని అనంతవరంలో బహుజన నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలుతో నివాళ్ళు అర్పించారు. అంబేద్కర్ జ్ఞాన సొసైటీ అధ్యక్షులు మైలా నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ బాషా మాట్లాడారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పేదలకు రాజ్యాంగం ద్వారా లభించిన హక్కులు కాలరాస్తుందని అన్నారు. ప్రతి గ్రామంలో రౌండ్ టేబుల్ సమావేశలు నిర్వహించి రాజ్యాంగంలోని హక్కులు ప్రతి ఒక్కరికి వివరించాలని అన్నారు. టిడిపి చిలకలూరిపేట ఉపాధ్యక్షులు పి కుల్లి మాట్లాడతూ యువకులకు ఓటు విలువ వివరించాలని అన్నారు. లిబరేషన్ కాంగ్రెస్ నాయకులు ఏయేసురత్నం మాట్లాడుతూ పేదలు ఓటు విలువ తెలుసుకొని, అమ్ముకోకుండా సరైన వ్యక్తికి ఓటు వేసి తమ గౌరం కాపాడుకోవాలని అన్నారు. మార్టూరులో నవంబర్‌లో నిర్వహించాలని, నవంబర్ 19న కోమటినేని వారిపాలెలో నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమం లో మహిళా మండలి అధ్యక్షురాలు విజయ, పర్చూరు నియోజకవర్గ ఎస్‌సి ఆర్‌పి సొసైటీ కన్వీనర్ రాము, గంగన్నపాలెం మాజీ ఎంపిటిసి సూర్యావర్ధనరావు పాల్గొన్నారు.


ఎన్‌సిసి శిక్షణ పొందుతున్న విద్యార్థులు

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సిసి

ప్రజాశక్తి - రేపల్లె

యువతను క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన, దేశభక్తిగల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సిసి కీలకమైనదని ఎన్‌సిసి ఆఫీసర్ కె బాలగురవయ్య అన్నారు. స్థానిక ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెనాలి 22వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో మొదటి సంవత్సర డిగ్రీ విద్యార్థులకు ఎన్‌సిసి నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఎన్‌సిసిలో చేరడం వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. ఎన్‌సిసి చేయడం వల్ల కలిగే ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన విద్యార్థులు భవిష్యత్‌లో పోలీసు శాఖలో ఉద్యోగం సంపాదించేందుకు సులభతరం అవుతందన్నారు. అనంతరం విద్యార్థులకు దేహ దారుడ్య పరీక్షలు నిర్వహించి నమోదు చేసుకున్నారు. 9మంది బాలురు, ఆరుగురు అమ్మాయిలను ఎంపిక చేశారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


గాయపడ్డ ఏసుదాసు

కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి పడటంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మార్టూరు సమీపంలోని జొన్నతాళి వద్ద గురువారం చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొండలరాయునిపాలెంకు చెందిన దార్ల ఏసుదాసు వ్యక్తిగత పనులపై గుంటూరు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108లో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ప్రవేటు వైద్యశాలకు తరలించారు.



బహుమతి అందజేస్తున్న ఎంవిఐ ప్రసన్నకుమారి

క్రీడల్లోనూ ముందుండాలి

ప్రజాశక్తి - కర్లపాలెం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని బాపట్ల ఎంవిఐ ప్రసన్నకుమారి అన్నారు. స్థానిక శ్రీ భార్గవి హై స్కూల్ నందు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని కోరారు. నగరం మండలం ఉల్లిపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన ఎస్‌జిఎఫ్ డివిజన్ స్థాయి అండర్17 బాలికల చెస్ పోటీల్లో శ్రీ భార్గవి హై స్కూల్ విద్యార్థిని ఏట్రా అమూల్య, అండర్ 14 విభాగంలో ఎట్ర దేవిశ్రీ జిల్లాస్థాయికి ఎంపిక కావడం పట్ల ఆమె అభినందించారు. ఎంపికైన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఆమెను దృశ్యాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పేరాల వెంకట సురేష్, ప్రిన్సిపాల్ బాపట్ల లక్ష్మి, ఉపాధ్యాయులు దివ్య, సునీత, సాహితీ, ప్రసన్నకుమారి, సత్యవతి, రిజ్వానా, ప్రేమావతి, చక్రవర్తి శివప్రసాద్, పిఈటి శివారెడ్డి పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్

విద్యార్థులు మృతి చెందటం బాధాకరం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని వాడరేవు సముద్ర తీరంలో జరిగిన విషాద ఘటనలో అలల తాకిడికి విద్యార్థులు మృతి చెందటం అత్యంత బాధాకరమని వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. కొత్తపేట వడ్డె సంఘంకు చెందిన యువకులు కూచన షారోన్, కోట గౌతమ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. విద్యార్థుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. విషాదంలో ఉన్న కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వైసీపీ తరపున సంతాపం ప్రకటించారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముండ్లమూరు


మండలంలోని దర్శి, అద్దంకి రోడ్డులో వేంపాడు ఎస్సీ కాలనీకి చెందిన గండి కమలాకర్ రోడ్డుపై నిలబడి ఉండగా గుర్తుతెలియని కారు ఢీ కొట్టింది. సంఘటనలో కమలాకర్‌కు కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడగా 108లో అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట హాస్పటల్‌కు తరలించారు.


పేకాట రాయిళ్లను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు ఊరు బయట పొలాల్లో పేకాట ఆడుతున్న వ్యక్తులను ఎస్ఐ జి సురేష్ అదుపులోకి తీసుకున్నారు. డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుండి రూ.5030 నగదు స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ ప్రదేశాలలో పేకాట, అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు.



కలెక్టర్‌ను కలిసిన కేసన శంకర్రావు

బీసీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బాపట్ల

బీసీల సమస్యలు పరిష్కరించేవిధంగా చొరవ చూపాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కలెక్టర్ వినోద్ కుమార్‌ను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీసీలు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల లేక ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా పరిస్థితు లపై కలెక్టర్, ఎస్పీ ఉమామహేశ్వరరావు తో పలు అంశా లపై చర్చించారు. ఆయన వెంట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా కార్యదర్శి మారం రవి కుమార్, పట్టణ కార్యదర్శి కంకణాల రాంబాబు పాల్గొన్నారు.



సిపిఆర్ చేసే విధానాన్ని వివరిస్తున్న వైద్యులు

సిపిఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇంచార్జ్ వైద్యాధికారి, ఉప్పుటూరు హెూమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ సిపిఆర్ అవగాహన కల్పించారు. విద్యార్థినీ, విద్యార్థులకు సిపిఆర్ ప్రక్రియ ఏ విధంగా చేయాలో వివరించారు. ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎప్పుడైతే ఒక వ్యక్తి అపస్మారకంగా గుండె కొట్టుకోకుండా, ఊపిరి తీసుకోకుండా స్పందన లేని స్థితిలో ఉంటాడో అప్పుడు ఛాతి ఎముకపై మన రెండు చేతుల్ని ఇంటర్ లాకింగ్ చేసి నిమిషానికి 100 నుంచి 120 సార్లు రెండు ఇంచుల లోతుకి మోచేతుల దగ్గర వంచకుండా బలంగా నొక్కాలనీ పేర్కొన్నారు. ప్రతి 30 కంప్రెషన్స్‌కు రెండు సార్లు అపస్మారకంగా ఉన్న వ్యక్తి నోటిలో గాలి ఊదాలని, ఆ విధంగా వ్యక్తి స్పృహలోకి వచ్చేదాకా లేదా అంబులెన్స్ లేదా వైద్య బృందం వచ్చేవరకు చేస్తూ ఉండడం వల్ల ప్రతి నలుగురిలో ఒకరిని కాపాడొచ్చని అన్నారు. మారుతున్న వేగవంతమైన జీవన విధానంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్సపై అవగాహన పెంచుకోవడం ద్వారా కొద్దిమందినైనా ప్రాణాపాయ స్థితి నుండి కాపాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, స్టాఫ్ నర్స్ చంద్రశేఖర్, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణ సమీపంలోని ద్వారకా నగర్ వద్ద కొత్తగా విద్యుత్తు సబ్ స్టేషన్ నిర్మాణం చేస్తున్నారు. కొత్త లైన్ ఏర్పాటు పనులు చేపడుతున్నందున మండలంలోని గోపాలపురం, తిమ్మాయపాలెం గ్రామాల్లో ఉదయం 9నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, పట్టణములోని కాకానిపాలెం, మౌలానగర్, కలవకూరు రోడ్డు, ద్వారకా నగర్, ఆటోనగర్, సింగరకొండలో మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇఇ ఎం దామోదరం తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

పంగులూరు : మండలంలోని ముప్పవరం 33/11 కెవి సబ్ స్టేషన్‌లో కొత్తగా రెండు 11 కెవి బ్రేకర్లు ఏర్పాటు చేసే పనుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఎఈ ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 17 వరకు అలవలపాడు, రేణింగవరం, కస్యాపురం, జాగర్లమూడి వారి పాలెం, ముప్పవరం, బైట మంజులూరు, భగవాన్ రాజుపాలెం, కొండమూరు గ్రామాలకు సరఫరా లిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పౌష్టికాహారం తీసుకుంటే మంచి ఆరోగ్యంగా ఉంటారని ఎంపిపి డివి లలితకుమారి అన్నారు. అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు సెక్టార్ పరిధిలో రాష్ట్రీయ పోషణ మాసం ముగింపు సందర్భంగా భట్టిప్రోలులో గురువారం అవగాహన కల్పించారు. సర్పంచి ధారా రవికిరణ్మయి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకొని అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న ఆహార పదార్థాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం పలువురు గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు చేశారు. సభకు సూపర్వైజర్ బి సంపూర్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అమృతలూరు సిడిపిఒ ఎ లక్ష్మీదేవి, ఎంపిటీసీ కె పద్మవతి, ఎపిఎం శ్రీమన్నారాయణ, సూపర్వైజర్ బి సంపూర్ణ పాల్గొన్నారు.

పర్చూరు : పౌష్టికాహారంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండవచ్చని, గర్భవతులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఒ జి సుభద్ర తెలిపారు. పర్చూరు ప్రాజెక్టు పరిధిలో పోషణ మాసోత్సవం ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు చేశారు. వెల్ బేబీ ప్రదర్శన నిర్వహించి విజేత లైన వారికి బహుమతులు అందచేశారు. వివిధ రకాల న్యూట్రిషన్ ఫుడ్ స్టాల్స్, సెల్ఫీ పాయింటు ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఉప్పుటూరు జడ్పీ స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసర రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఎంఈఓలు శివ కోటేశ్వరరావు, వెంకటరామయ్య, ఐసిడిఎస్ అధికారులు కృష్ణ, రాము పాల్గొన్నారు.

రేపల్లె : పోషకాలు, మాంసకృత్తులు, పిండిపదార్థాలు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు, నీరు వంటివి ఆరోగ్యానికి బాగా దోహదపడతాయని సిడిపిఒ ఎం సుచిత్ర అన్నారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవం ముగింపు ఘనంగా నిర్వహించారు. అన్నప్రాసనలు, శ్రీమంతాలు, వెల్ బేబీ షో, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న వంటకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం 40ఏళ్లుగా సేవ పూర్తి చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలకు సన్మానం చేశారు. పోషణ మాసోత్సవంలో ఫోటోలు అప్‌లోడ్ చేసి ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లడంలో చురుకుగా ఉన్న లీడర్లను సత్కరించారు. కార్యక్రమంలో



వంటలు పరిశీలిస్తున్న భట్టిప్రోలు ఎంపిపి లలిత కుమారి

సీడీపీఓ మాధవి, ఆయుర్వేదిక్ డాక్టర్, సూపర్వైజర్లు సిహెచ్ హిమబిందు, తమ్మ రాధికా, మంజుల, నాగలక్ష్మి, బిపిసి అరుణ శ్రీనివాస్, సిఆర్ఎఫ్ ఆర్గనైజేషన్ ఎన్‌జీఓ అంకమ్మరావు, ప్రెసిడెంట్ గంగాధర్, సెక్రటరీ శ్రావణ్, కోశాధికారి సురేంద్ర, వైస్ ప్రెసిడెంట్ ఇల్లయ్య, శ్రీనివాస్, సుభాషిణి పాల్గొన్నారు.

సంతమాగులూరు : అంగన్‌వాడి ద్వారా ప్రజలకు పోషకాహారాన్ని అందిస్తున్నారని ఎఎంసి చైర్మన్ తేల్ల్రపోలు రమేష్ తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ మాసోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16వరకు సంతమాగులూరు, బల్లికురవ మండలాల్లో ప్రాజెక్ట్ స్థాయిలో కార్యక్రమం చేస్తున్నట్లు సిడిపిఒ డి సుధ తెలిపారు. విద్యార్థులకు పోషకాహారం పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు న్యూట్రిషియన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. గర్భిణీలకు సీమంతాలు చేసి సారె అందజేశారు. ఉత్తమ అంగనవాడీ కార్యకర్తలను గుర్తించి మెమొంటో, శాలువాతో సత్కరించారు. కొప్పరం పంచాయతీ నెహ్రూనగర్ అంగన్వాడి కార్యకర్త మొగిలి తిరుమల తన 13ఏళ్ల కుమారుడు సిద్ధార్థ అండర్ 14 అంతర్రాష్ట్ర క్రికెట్ జట్టులో ఎంపికైనందుకు ఎఎంసి చైర్మన్ తేల్ల్రపోలు రమేష్ శాలువాతో సత్కరించారు.

ఇంకొల్లు : మండలంలోని పావులూరు రోడ్డులోని రోటరీ గంగా భవనంలో పోషణ మాసోత్సవం గురువారం నిర్వహించారు. చిరుధాన్యాలతో వంటలు తయారు చేసి స్టాల్ నిర్వహించారు. బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఇఒ శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. న్యూట్రిషన్ ఫుడ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇచ్చారు. గర్భవతులకు సీమంతం చేశారు. డాక్టర్ ఆనంద్, పిఒఎస్‌ఐపి కృష్ణ, సిడిపిఒ జి సులోచన రాణి, ఎంఇఒ, దుద్దుకూరు పీహెచ్సీ వైద్యాధికారి పాల్గొన్నారు.

'జీఎస్టీ సేవింగ్స్'పై ఆటోలతో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల

జీఎస్టీ తగ్గింపుతో ప్రజల జీవన ప్రమాణాల్లో వినూత్నమైన మార్పులు చోటు చేసుకున్నాయని సంయుక్త కలెక్టర్ భావన అన్నారు. జీఎస్టీ 'సేవింగ్స్'పై ఆటోలతో అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. బాపట్ల అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి మాట్లాడుతూ రవాణా రంగానికి ఎంతో ప్రయోజనం అన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ కమిషనర్ మురళీకృష్ణ, ఎంపిడిఒ రంగారావు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

పర్చూరు : ప్రభుత్వం వివిధ వస్తువులపై తగ్గించిన జీఎస్టీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. పర్చూరులో జీఎస్టీపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ప్రత్యేక అధికారి ఎస్ లవన్న ఆదేశాల మేరకు ఎంపిడిఒ మాట్లాడుతూ తగ్గించిన జీఎస్టీపై గత 25 రోజులుగా వివిధ కార్యక్రమాలుగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ర్యాలీని ఆర్టీఒ రవి నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. వీరాల రోడ్డులోని నెహ్రూ కాలనీ నుండి బొమ్మలు సెంటర్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్టీ నోడల్ అధికారి ఎం శ్రీనివాసరావు, ఏపి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షంషుద్దీన్, ఎస్ఐ జివి చౌదరి, ట్రైనీ ఎస్ఐ గోపి, వాహనాల షోరూం నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రేపల్లె : ప్రజల కష్టార్జితం ప్రజలకే చెందేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్ తెలిపారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సాంబశివరావు, ఇతర అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

చీరాల : జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన ఉండాల్సిన ఆవశ్యకత ఉందని ఎంపిడిఒ రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి స్టేట్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ శ్రీనివాసరావు, జమీర్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు మాట్లాడారు. ధరలు తగ్గాయని అన్నారు. ఆర్థిక భారం తగ్గి దీపావళి పండుగ మరింత ఆనందంగా చేసుకునే అవకాశం లభించిందని అన్నారు.

అద్దంకి : జీఎస్టీ సేవింగ్స్‌పై రవాణాశాఖ ఆధ్వర్యంలో నామ్ రోడ్డు, కలవకూరు రోడ్డు నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ గురువారం నిర్వహించారు. పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, తహశీల్దారు జి చరణ్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. నిత్యావసరాల ధరలు తగ్గి పేదలు ఎంతో లబ్ధి పొందుతారని అన్నారు. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బి మల్లికార్జున రావు, ఎంపిడిఒ బి కిషోర్, ధూళిపాల సుబ్బారావు, కె నరేంద్ర, అంకమ్మరావు, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ చక్రవర్తి, సురభి రాంబాబు, డి రాజా, తిరుపతయ్య, దస్తగిరి, రాజు పాల్గొన్నారు.



హాస్పిటల్ పక్కన మురుగు పరిశీలిస్తున్న అధికారులు

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పంగులూరు

వర్షాకాలం కావడం వలన మురుగు కుంటల్లో నీరు నిల్వ ఉండి దోమల విస్తరణకు కేంద్రాలుగా మారుతున్నాయని, తద్వారా విషజ్వరాలు ప్రబలుతున్నాయని ఎంపిడిఒ కె స్వరూపరాణి అన్నారు. వీటి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. స్థానిక పిహెచ్‌సి పక్కనే నీరు నిలువ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. దోమలు నివారించేందుకు ఆయిల్ బాల్స్ వదిలినట్లు చెప్పారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల వివరాలు పంచాయతీ అధికారులకు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సుమంత్, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, నాయకుడు రామారావు పాల్గొన్నారు.




మొక్కలు నాటుతున్న దృశ్యం

మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరంలో బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ, యూనివర్సల్ టుబాకో సంయుక్తంగా రైతులకు జామ, మామిడి, నిమ్మ, సపోటా, సీతాఫలం, నేరేడు మొక్కలు గురువారం పంపిణీ చేశారు. చెరువు కట్టలపై మొక్కలు నాటారు. 400 మొక్కలు అందించారు. గతంలో ఇదే సంస్థ చెరువులో పూడిక తీత మట్టిని ఉచితంగా రైతులకు అందించటంతో పాటు చెరువుకట్ట పటిష్టం చేశారు. సంస్థ ప్రతినిధులు రత్న కుమార్, విక్రమ్ గ్రామస్థులు రైతులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

గత నెల 19, ఈనెల 8, 9,10 తేదీల్లో పందిళ్ళపల్లి, కొలలపూడి, ఇంకొల్లు జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల పోటీల్లో స్థానిక మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మహమ్మద్ నహిద తెలిపారు. అండర్ 17 విభాగంలో 100, 400మీటర్లలో కాటంరాజు, 200 మీటర్లలో కిషోర్, హైజంప్‌లో రహీం, ఖోఖోలో కాలీషా, కబడ్డీలో కాటంరాజు, చెస్‌లో గోపీకృష్ణ, వాలీబాల్‌లో కిషోర్, 5కిలోమీటర్లు, 3కిలోమీటర్లు రన్నింగ్‌లో గృహత్, శ్రీను, అండర్ 14 విభాగంలో 200మీటర్లు, 400 మీటర్లు, వాలీబాల్‌లో వినయ్ కుమార్, 400 మీటర్లలో సతీష్ కుమార్, చెస్‌లో దేవరాజు, ఖోఖోలో చందు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పిఈటి కె మమతను అభినందించారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

నానో యూరియా వాడడం వలన తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చని ఎఒ ఎండి ఫరూక్ అన్నారు. కావూరు లో గుంటూరు ఆత్మ ఆధ్వర్యంలో నానో యూరియా ప్రయోజనాలు, పిచికారి గురించి ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎకరాకు అర లీటరు సరిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ రామకృష్ణ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు

వంద శాతం పూర్తి చేయాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ఈ-పంట నమోదు 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. వరి పంట మాత్రమే కాకుండా ప్రతి పంటను ఈ పంటల యాప్‌లో నమోదు చేయాలన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశం మందిరంలో వరి సేకరణ, పెన్షన్ రీఅసెస్మెంట్, స్మార్ట్ రైస్‌కార్డ్ పంపిణీ, ఈ పంట, రెవెన్యూ సేవలు, ఆసుపత్రి సేవల ప్రజాభిప్రాయంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ తక్కువగా నమోదుకు గల కారణాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆరా తీశారు. పిడిఎస్ రైస్ పంపిణీలో కొన్ని గ్రామాలు తక్కువ శాతం నమోదు అయ్యాయని, రైస్ కార్డు తీసుకోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి క్యూఆర్ కోడ్ స్మార్ట్ రైస్ కార్డులను అందజేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఆసుపత్రి సేవలపై ఐవీఆర్ఎస్ ద్వారా నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా వెనుకబడి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డిసిహెచ్ఎస్ పద్మావతి, జెడి అగ్రికల్చర్ సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఇన్చార్జి పీడీ డిఆర్డిఏ లవన్న, వీక్షణ సమావేశం ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్ భావన, డిఆర్ఓ గంగాధర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

జిఎస్‌టి సంస్కరణలతో

వాహనదారులకు ప్రయోజనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ సుజాత, డిటిసి సుశీల

జిఎస్‌టి 2.0 సంస్కరణలతో చిన్న వాహనదారులకు ప్రయోజనం చేకూరుతుందని ఒంగోలు మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల ఆధ్వర్యంలో సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా చిన్న వాహనాల ర్యాలీని ఒంగోలు మేయర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒంగోలు మేయర్ మాట్లాడుతూ 'వికాస్ విశ్వాస్ నమ్మకమైన అభివద్ధి' నినాదంతో వాహనాల జిఎస్‌టి కేంద్ర ప్రభుత్వం తగ్గించిందన్నారు. చిన్న వాహనాలైన ఆటో రిక్షా, మోటార్ కార్స్, క్యాబ్స్, లారీలు, బస్సులు, ట్రాక్టర్లకు 28 నుంచి 18 శాతం వరకు జిఎస్‌టి తగ్గించారన్నారు. 12 నుంచి 5 శాతం వరకు రాయితీ ఇచ్చారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన రాయితీలను జిల్లా వాహనదారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో కళావతి, డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ డి.సత్య ప్రకాష్, మోటార్ వాహన తనిఖీ అధికారి సురేంద్ర ప్రసాద్, కార్యాలయ సిబ్బంది, డీలర్స్, ఆటో డ్రైవర్స్ పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడే సంజీవని సిపిఆర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గుండె జబ్బుల బారిన పడిన వారి ప్రాణాలను కాపాడే సంజీవని సిపిఆర్ పద్ధతి అని ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు పిలుపునిచ్చారు. హృదయ పునరుజ్జీవన విధానం (సిపిఆర్) అవగాహన వారోత్సవాలలో భాగంగా గురువారం ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ప్రజలకి అవగాహన, లైవ్ డెమో కార్యక్రమం నిర్వహించారు. జిజిహెచ్ వైద్యులు సిపిఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్, అనస్తీషియా ఇన్‌ఛార్జి విభాగాధిపతి డాక్టర్ చలపతి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ త్రినాధ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణీత్, డాక్టర్ యశో వర్ధన్, జిజిహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ అక్రమ రవాణాపై తనిఖీలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అన్ని శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం "రేషన్ బియ్యం.. మూడొంతులు పక్కదారి.!" శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ విషయమై డిఎస్ఓ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవినీతికి పాల్పడుతున్న రేషన్ డీలర్లు, రైస్ మిల్లులపై 6ఏ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2025 సంవత్సరంలో ఇప్పటి వరకు 122 6ఏ కేసులు నమోదు చేసి.. 588.165 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు డిఎస్ఓ తెలియజేశారు.

ఐదేళ్ల లోపు చిన్నారులకు

ఆధార్ నమోదు తప్పనిసరి

- 23 నుంచి అన్ని పాఠశాలల్లో ఆధార్ నవీకరణ
- కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆధార్ కార్డుల నమోదు ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాలలో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డు నమోదు తక్షణమే చేపట్టాలని చెప్పారు. తల్లి బిడ్డకు జన్మనివ్వగానే వైద్యశాలలోనే ఆధార్ నమోదు చేయాలన్నారు. ఏదైనా కారణం వల్ల నమోదు కాలేకపోతే అంగన్వాడీ కేంద్రం పరిధిలోనే ఆధార్ నమోదు తప్పనిసరిగా జరగాలన్నారు. ఐదు నుంచి ఏడు సంవత్సరాల లోపు బాలలకు బయోమెట్రిక్ నవీకరణ విధిగా నిర్వహించాలన్నారు. లేకుంటే ఆధార్ కార్డులు రద్దయే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే 15 నుంచి 17 సంవత్సరాల లోపు యువతీయువకుల ఆధార్ కార్డులలో బయోమెట్రిక్ నవీకరణ తప్పనిసరిగా చేయించాలన్నారు. లేకుంటే వారి ఆధార్ కార్డులు రద్దు కానున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 21,671 ఐదు నుంచి ఏడేళ్ల లోపు బాలలు ఆధార్ కార్డులు నవీకరణ పెండింగ్ లో ఉందన్నారు. అలాగే 14,536 మంది 15 నుంచి 17 సంవత్సరాల లోపు యువతీ యువకుల ఆధార్ నవీకరణ పెండింగ్ లో ఉండటంపై ఆరా తీశారు. చిన్నారుల వయస్సు ఎదిగే కొద్దీ చేతి వేలిముద్రలు మారుతున్న నేపథ్యంలో ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియను తప్పనిసరిగా చేసిందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి తక్షణమే ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

ఈ నెల 23 నుంచి అన్ని పాఠశాలల్లో ఆధార్ నవీకరణ ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య రాకుండా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. జిల్లాలో 110 ఆధార్ నమోదు కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం 80 కేంద్రాలు పని చేయడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలలో బదిలీల ప్రక్రియ నేపథ్యంలో ఏర్పడిన సాంకేతిక సమస్యల ద్వారా 30 కేంద్రాలు పనిచేయడం లేదని ఆధార్ కార్డుల రీజినల్ మేనేజర్ ప్రసాద్ కలెక్టర్ దష్టికి తెచ్చారు. ప్రతి మండలంలో ఆధార్ కార్డుల నమోదు కేంద్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. త్వరలోనే మిగిలిన కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ చెప్పారు. ఐదు నుంచి ఏడు సంవత్సరాలలోపు బాలల బయోమెట్రిక్ నవీకరణ, 15 నుంచి 17 సంవత్సరాలలోపు యువతీ యువకుల ఆధార్ నవీకరణ ప్రక్రియకు ఎలాంటి రుసుము లేదన్నారు. ఆ రెండు వయస్సుల వారి నవీకరణ ప్రక్రియకు ఉచిత సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. సమావేశంలో డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి రాధామాధవి, డిపిఓ ప్రభాకర్ రావు, ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ బాబు, కామన్ సర్వీస్ సెంటర్ మేనేజర్ వందనం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ కోసం

రైస్‌మిల్లులు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ధాన్యం సేకరించడానికి రైస్ మిల్లులు, రైతు సేవా కేంద్రాలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. గురువారం అమతలూరు మండలం కూచిపూడి గ్రామంలో రైస్ మిల్లును, రైతుసేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ నుండి వరి ధాన్యం దిగుబడులు ప్రారంభం అవుతాయని అన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా వరి ధాన్యం సేకరించి రైస్ మిల్లులో, రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేసిన నిల్వలు చేయడానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రైతులు పండించిన ధాన్యం నిల్వ చేసుకోవడానికి రైస్ మిల్లులు, రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ధాన్యం సేకరణకు అవసరమైన కాళీ గోతాలు, తేమశాతం కొలిచే మిషన్లను సిద్ధం చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి, వ్యవసాయశాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అమతలూరు తహశీల్దార్ నెహ్రూబాబు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఎస్పీకి మొక్క అందజేస్తున్న జేసీ

ఎస్పీని కలిసిన జేసీ భావన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా నూతన సంయుక్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భావన వశిష్ట గురువారం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేశారు.

పరిశ్రమల ఏర్పాటుతో

అన్ని రంగాల వృద్ధి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుతో అన్ని రంగాలు వద్ధి చెందుతాయని ఇందుకోసం పరిశ్రమల భాగస్వాముల ప్రేరణ కార్యక్రమాలు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. పరిశ్రమలు పెట్టుబడుల భాగస్వాముల సదస్సు సందర్భంగా రూపొందించిన గోడ పత్రాలను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ గురువారం కలెక్టరేట్లో విడుదల చేశారు. పెట్టుబడిదారుల భాగస్వాముల సదస్సు నవంబర్ 14, 15వ తేదీలలో విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని కలెక్టర్ చెప్పారు. ప్రపంచ స్థాయిలో పెట్టుబడుల దారులను ఆకర్షించేలా విశాఖపట్నంలో పరిశ్రమలకు సంబంధించి సదస్సు జరుగుతుందన్నారు. పరిశ్రమల ఆధునికీకరణ, స్థిరీకరణ, పెట్టుబడిదారులు సంసిద్ధత, తోడ్పాటు, పరిశ్రమల పరిశుభ్రత, పరిశ్రమలలో మొక్కలు నాటడం, పర్యావరణ అనుకూలతలు తదితర అంశాలపై ఈనెల 17 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఏపీఐఐసీ ద్వారా జిల్లాలోని అన్ని పరిశ్రమలలో ఈ సదస్సులు జరుగుతాయన్నారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు పారిశుద్ధ్యం, పరిశుభ్రత కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, ఏపీఐఐసీ గుంటూరు జోనల్ మేనేజర్ నరసింహారావు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ రామకష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గుండ్లకమ్మ' ప్రాజెక్టు

భూసేకరణ పనులు వేగంగా చేపట్టాలి

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గుండ్లకమ్మ ప్రాజెక్ట్ భూసేకరణ పనులు వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుపై సంబంధితశాఖల అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ కింద 50 ఎకరాల భూసేకరణ చేయక పోవడంతోనే బాపట్ల జిల్లాలో 13,876 ఎకరాలకు సాగునీరు రావడం లేదని కలెక్టర్ చెప్పారు. ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో 50 ఎకరాల భూసేకరణ పనులు నిలిచిపోవడంపై ఆరా తీశారు. తక్షణమే భూసేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం గుండ్లకమ్మ ప్రాజెక్ట్ 14 గేట్లు మరమ్మతులు పూర్తి కాగా, మరొక గేటు పనులు జరుగుతున్నాయన్నారు. వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు ద్వారా బీడు భూములకు సాగునీరు అందించడం లక్ష్యం అన్నారు. తాజాగా బాపట్ల జిల్లాలో 2,600 ఎకరాల భూమి ఆయకట్టు పరిధిలోకి తీసుకురావడానికి గజిట్ విడుదల చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం అధికారికంగా ప్రకటన విడుదలకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో 78 ఎకరాల భూమి ఆయకట్టులోకి తెచ్చేందుకు జలవనరులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ వారంలో పూర్తి చేయాలన్నారు. కొరిశపాడు, అద్దంకి మండలాలలో మూడు గ్రామాలలో 1,100 కుటుంబాలకు పునరావాసం కింద నివేశన స్థలాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ప్రాజెక్టుల ఎస్ఈ అబూతలీమ్, ఆర్డీవో చంద్రశేఖర్, ఉప కలెక్టర్లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.